ఉత్తరకంచి స్టేట్‌బ్యాంక్‌లో

భారీ చోరీ
- 7లో

- బ్యాంకు వెనుక నుంచి చొరబడిన దుండగులు
- రూ.25 లక్షల నగదు, రూ.50 లక్షల బంగారం అపహరణ

ఏళ్ల తరబడీ.. 'జాగా'రమే

- అసెంబ్లీ ఎన్నికలు సమీపించినా జిల్లాలో పేదలకు దక్కని ఇళ్ల స్థలాలు
- రెండున్నరేళ్ల కిందట ఇళ్ల పట్టాలిచ్చి చేతులు దులిపేసుకున్న ప్రభుత్వం
- ఇప్పటివరకు స్థలాలు కేటాయించకపోవడంతో లబ్ధిదారులు ఆగ్రహం
- జిల్లావ్యాప్తంగా 4వేల మందికిపైగా ఎదురుచూపులు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

అంతన్నారు.. ఇంతన్నారు.. అదిగో ఇళ్లు అన్నారు.. రూ.10 లక్షల విలువ చేసే ఇంటి స్థలం ఉచితం అన్నారు.. పదేళ్లు ఆగితే ఏకంగా అమ్మేసుకోవడానికి అంతా ఓకే అంటూ ఊరించారు. తీరా చూస్తే చేతిలో ఇంటి పట్టా కాగితం తప్పించి కట్టుకోవడానికి స్థలం కూడా ఇవ్వకుండా వదిలేశారు. అదీ ఒకటి, రెండు కాదు మూడేళ్ల నుంచీ ఇదే తీరు.జనాలను అడ్డగోలుగా మోసం చేయడంలో ఆరితేరిన జగన్ ప్రభుత్వం ఇళ్లస్థలాల విషయంలో పేదలను నిలువునా దగా చేసింది. గూడు లేని పేదలకు ఇంటి స్థలం ఇస్తామని నమ్మించి పట్టా ఇచ్చి రోడ్డుపై వదిలేసింది. ఇలా ఒకరు.. ఇద్దరు కాదు జిల్లావ్యాప్తంగా 4వేలమంది వరకు నిరుపేదలు ఇళ్ల స్థలాలు చేతికి అందక ఉత్తి పట్టాలతో ఈసురోమంటున్నారు. కానీ ప్రభుత్వం అదిగో.. ఇదిగో అంటూ ఏళ్ల తరబడి కాలయాపన చేస్తోందేగానీ స్థలం ఇవ్వడం మాత్రం కనిపించడం లేదు. మరోపక్క అసెంబ్లీ ఎన్నికలకు మరో రెండునెలలే వ్యవధి ఉంది. ఈ నేపథ్యంలో పేదలకు స్థలాలు అందడం అసాధ్యమనే చెప్పాలి.

ఏం 'పట్ట'దంతే..

నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా సీఎం జగన్ జిల్లాలో 2020, డిసెంబరు 25న పిఠాపురం నియోజకవర్గం యు.కొత్తపల్లి మండలంలో పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ ప్రారంభించారు. మొత్తం 72,041మంది పేద లబ్ధిదారులకు ఇళ్లు నిర్మించి ఇస్తామని ప్రకటించారు. తీరా ఆర్థిక భారం ఎక్కువవుతోందని బెంబేలెత్తి సీఎం మాట మార్చారు. ఇచ్చిన స్థలాల్లో ఇళ్లు పేదలే కట్టుకోవాలని మెలిక పెట్టారు. పథకంలో భాగంగా నగరాలు, పట్టణాల్లో లబ్ధిదారులకు సెంటు, గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు సెంటున్నర స్థలం ఉచితంగా ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అందులోభాగంగా జిల్లావ్యాప్తంగా 359లేఅవుట్లను ప్రభుత్వం గుర్తించింది. ఎంపిక చేసిన లబ్ధిదారుల్లో ఇంకా చాలామందికి పట్టాలు చేతిలో పెట్టినా ఇప్పటికీ స్థలం చూపించలేదు. దీంతో వారంతా రెండున్నరేళ్లుగా కాళ్లరిగేలా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. తమ సమీప ప్రాంతాల్లో ఉన్న పేదల ఇళ్ల స్థలాలు అనేకమందికి ఇచ్చినా తమకు ఇంకా ఇవ్వకపోవడంతో వీరంతా ప్రభుత్వం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి జిల్లాలో ఈ పథకం కింద ప్రభుత్వ భూములు చాలక ఇళ్ల స్థలాలను ప్రైవేటు వ్యక్తుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఈ క్రమంలో అధికార పార్టీనేతలు కొందరు అధికారులతో కుమ్మక్కై ఎక్కడో మారుమూల ప్రాంతాల్లో రూ.20లక్షల ఎకరం భూమిని ముందే కొనుగోలు చేసి ఎకరం రూ.43లక్షల చొప్పున ప్రభుత్వానికి అంటగట్టి కోట్లలో సంపాదించారు. ఈక్రమంలో ఈ భూములను లేఅవుట్లగా వేసి పేదలకు పంచారు. కానీ ఇవి ఊర్లకు దూరంగా విసిరేసినట్లు ఉండడంతో అక్కడికి ఎవరు వెళ్లడం లేదు. దీంతో ఇప్పటికే అనేకచోట్ల పేదల ఇళ్ల స్థలాలు ఇళ్ల నిర్మాణం జరగక ఖాళీగా మారాయి. ఇదంతా ఒకెత్తయితే అనేకచోట్ల భూములు లోతట్టు ప్రాంతాల్లో ఉండడంతో జనం తిరస్కరించారు. ఇంకొన్నిచోట్ల అసలు భూములే సేకరించలేదు. ఇలా వివిధ కారణాలతో జిల్లాలో ఇంకా 4వేలమంది వర కు పేదలకు స్థలాలు కేటాయించలేదు. వీరికి ఆర్భాటంగా పట్టాలు ఇచ్చినా స్థలాలు చూపించకపోవడంతో ప్రభుత్వం తీరుపై మండిపడుతున్నారు. అటు అధికారులు కూడా పట్టిం చుకోకపోవడంతో ఎక్కడికక్కడ ఆందోళనలకు దిగుతున్నారు. ఇప్పటికే పిఠాపురం, పెద్దాపురం, జగ్గంపేట, ప్రత్తిపాడు తదితర నియోజక వర్గాల్లో లబ్ధిదారులు స్థలాల కోసం ఎమ్మెల్యేలను నిలదీశారు. మండలాల్లోను, కలెక్టరేట్ వద్ద ఆందోళ నలకు దిగారు.



కాకినాడ కలెక్టరేట్‌వద్ద ఈనెల 5న ఆందోళన చేస్తున్న జగనన్న ఇళ్ల పట్టాదారులు

ఇంక అందనట్లేనా..

ప్రధానంగా గండేపల్లి మండలంలో 2,300మంది పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయగా కేవలం 1,250మందికే స్థలాలు కేటాయించారు. మిగిలిన వారికి స్థలాలు అందక ఆందోళన చేస్తున్నారు. ప్రత్తిపాడులో 1,035మందికి పట్టాలు ఇచ్చినా స్థలాలు అందలేదు. రౌతులపూడి మండలంలో 5,126మందికి ఇళ్లపట్టాలు మంజూరు చేయగా వెయ్యి మందికే స్థలాలు ఇచ్చారు. మిగిలిన 4,126మంది స్థలాల కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. పిఠాపురం పట్టణంలో 3,738మందికి 2020, డిసెంబర్‌లో పట్టాలు ఇచ్చారు. వీరికి ఇంతవరకు అసలు స్థలాలే కేటాయించలేదు. కరప మండలంలో 6,100మందికి పట్టాలు ఇవ్వగా, ఇంకా 1,650మందికి స్థలాలు చూపించలేదు. కిర్లంపూడి మండలంలో 3,815మంది లబ్ధిదారులకుగాను 934మందికి స్థలాలు చూపించలేదు. తుని పట్టణం, గ్రామీణ మండలంలో మొత్తం 9,630మందికిగాను 600మందికిపైగా లబ్ధిదారులకు ఇంటి స్థలాలు అందలేదు. తాళ్లరేవులో 5,600మందికిగాను 2,600మందికి పట్టాలు ఇచ్చి స్థలాలు కేటాయించలేదు. కోటనందూరు 634, కాకినాడ రూరల్ మండలంలో 16,313మందికిగాను ఇంకా 4,500 మందికి పట్టాలు ఇచ్చి ఏళ్లు గడుస్తున్నా ఇంటి స్థలాలు కేటాయించలేదు. ఇలా ఎక్కడికక్కడ జిల్లావ్యాప్తంగా జగన్ ప్రభుత్వం పేదలతో ఆడుకుంటోంది. ఏళ్లు గడుస్తున్నా స్థలాలు కేటాయించకపోవడంతో ఇంట్లో ఉన్న పట్టాలు లబ్ధిదారులను వెక్కిరిస్తున్నాయి. వీరందరికీ కేటాయించడానికి ఎక్కడా ప్రభుత్వ భూములు లేవు. దీంతో పలుచోట్ల ప్రైవేటు భూములు కొనుగోలు చేసి ఇవ్వాల్సి ఉంది. కానీ ప్రస్తుతం జగన్ ప్రభుత్వం పీకల్లోతు ఆర్థిక కష్టాల్లో ఉన్న నేపథ్యంలో ఇప్పట్లో వీటిని సేకరించి లేఅవుట్ వేసి స్థలాలు కేటాయించడం అసాధ్యమనే చెప్పాలి. పైగా అసలే అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా రెండు నెలలే వ్యవధే ఉంది. ఈ నేపథ్యంలో పేదలకు స్థలాల కేటాయింపు జరిగే అవకాశం లేదని అధికారులు అంగీకరిస్తున్నారు.

ఇలా అయితే.. వండిపెట్టలేం

- మధ్యాహ్న భోజన కార్మికుల కష్టాలు
- మూడు నెలలుగా బిల్లులు పెండింగ్



ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు(ఫైల్)

పెద్దాపురం, ఫిబ్రవరి 8: నాడు-నేడు పథకంతో పాఠశాలలను తీర్చిదిద్దామని హడావుడి చేస్తున్న ప్రభుత్వం అక్కడ చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, వంటశాలల కష్టాలను పట్టించుకోవడంలేదు. భోజన నిర్వాహకులకు సంబంధించిన బిల్లుల చెల్లింపులు మూడు నెలలు పెండింగ్ ఉన్నాయి. మరోవైపు రోజురోజుకూ పెరిగిపోతున్న నిత్యావసర వస్తువుల ధరలు, కరెంట్ ఛార్జీలు, గ్యాస్ ధరలతో మధ్యాహ్న భోజనం కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇలాఅయితే పాఠశాల పిల్లలకు మధ్యాహ్న భోజనం వండిపెట్టలేమని నిర్వాహకులు చేతులెత్తేస్తున్నారు. భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఇప్పటికే తొలి దఫా ఆందోళన చేపట్టారు. నెలకు రూ.10వేలు వేతనం ఇస్తానని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని కూడా ఇంతవరకూ అమలు చేయకపోవడంపై నిర్వాహకులు ప్రభుత్వానికి వినతిపత్రాలు పంపించారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన చేయక తప్పదని హెచ్చరిస్తున్నారు. జిల్లాలో మధ్యాహ్న నిర్వాహకులు 1700కు పైబడి ఉన్నారు. వంట గ్యాస్‌తో సహా నిర్వాహకులే బిల్లులనుంచి ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇక నిర్వాహకులకు నెలకు రూ.3వేల వేతనం ఇస్తున్నారు. కొంతకాలంగా ఈ వేతనాలు కూడా సక్రమంగా చెల్లించడం లేదు. ఒక్కసారి మూడునెలలపాటు చెల్లించారు. ఇంకోసారి రెండునెలల పెండింగ్‌లో ఉంచుతారు. జిల్లాలో కనీసం 3లక్షల పైబడి బిల్లులు సకాలంలో చెల్లింపులు జరగని కారణంగా నిర్వహణ కష్టంగా మారుతుందని వాపోతున్నారు.

సొంత నగదును వెచ్చిస్తున్నాం

ఇచ్చిన మెనూ ప్రకారం నాణ్యతా లోపం లేకుండా భోజనం పెట్టాలని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం ఇస్తున్న బిల్లులు చాలక సొంత నగదు వెచ్చించాల్సి వస్తోంది. ఉల్లి, కూరగాయాలు ధరలు పెరిగాయి. పప్పులైనా ప్రభుత్వం సరఫరా చేయాలి.

-కరక సుబ్బలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శి, మధ్యాహ్న భోజన పథక కార్మిక సంఘం, పెద్దాపురం

ఇవీ డిమాండ్లు..

జగన్ పాదయాత్ర సందర్భంగా అధికారంలోకి వస్తే రూ.10వేలు వేతనం ఇస్తామని హామీ ఇచ్చారని, దాన్ని అమలు చేయాలని, ప్రతినెలా 5వతేదీలోపు వేతనాలు బిల్లులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. మెనూ ఛార్జీలకు రూ.20 ఇవ్వాలని, ధరల పెరుగుదలకు అనుగుణంగా బడ్జెట్ పెంచాలని కోరుతున్నారు. ధరలు పెరిగినందున గ్యాస్ ప్రభు త్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. రేషనలై జేషన్ పేరుతో స్కూల్ విలీనం చేయడం వల్ల ఉపాధి కోల్పోతున్న వర్కర్లకు ఉపాధి భద్రత కల్పించాలని, వంట చేసేటప్పుడు అగ్నిప్రమాదానికి గురైన వారికి నష్టపరిహారం అందించాలని, ఈ పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించరాదని డిమాండ్ చేస్తున్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ యూనిఫామ్ ఇవ్వాలని, హైస్కూల్‌లో పని చేస్తున్నవారికి వేతనం ఇవ్వాలని, రాజకీయ వేధింపులు ఆపాలని వారు కోరుతున్నారు.

ఆశా వర్కర్ల నిర్బంధం

- ఛలో విజయవాడ ధర్నాకు వెళ్లకుండా అడ్డంకులు
- కాకినాడ కలెక్టరేట్ వద్ద అడ్డుకున్న పోలీసులు.. తోపులాట
- జిల్లాలో ఎక్కడికక్కడ ఆశా కార్యకర్తల అరెస్టులు



తుని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఆశావర్కర్లు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 8: ఆశావర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వర్తింపజేయాలని తదితర డిమాండ్లతో ఏపీ ఆశావర్కర్స్ యూనియన్(సీఐటీయూ) పిలుపు మేరకు తలపెట్టిన ఛలో విజయవాడ ధర్నాకు ఆశాలు వెళ్లకుండా పోలీసులు నిర్బంధించారు. గురువారం తెల్లవారుజామునుంచి నగరంలో ఎక్కడికక్కడ పోలీసుల ద్వారా ఆశాలను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. రైల్వేస్టేషన్‌లో, బస్టాండ్‌లో, సొంత వాహనాలపై వెళ్తున్న ఆశాలను పోలీసులు అరెస్టు చేశారు. ప్రభుత్వ నిర్బంధాన్ని నిలదీస్తూ ఆశావర్కర్లు సుందరయ్య భవన్‌నుంచి కలెక్టరేట్‌కు వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో చాలాసేపు తోపులాట జరిగింది. ఆందోళనకు నాయకత్వం వహించిన సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జి, ఆశవర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి నక్క లలిత, నాయకులు మలకా నాగలక్ష్మి, చెక్కల వేణిలను అరెస్టు చేసి కాకినాడ వన్‌టౌన్, త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు. అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని కాకినాడ ఆర్డీవో కార్యాలయంవద్ద 200మంది ఆశాలు ధర్నా నిర్వహించడంతో పోలీసులు నాయకులను విడుదల చేశారు. అనంతరం ఆశాలను ఉద్దేశించి శేషబాబ్జి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ ఆశావర్కర్లకు అమలు చేయాలన్నారు. పీఎఫ్, ఈఎస్‌ఐ అమలు చేయాలని, యాప్‌ల పేరుతో మోపుతున్న పనిభారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, నాయకులు టి.రాజా, రొంగల ఈశ్వరరావు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



కాకినాడ కలెక్టరేట్ వద్దకు వెళ్లకుండా ఆశాలను అడ్డుకుంటున్న పోలీసులు

కాకినాడ డీఈవోగా రమేష్ బాధ్యతల స్వీకరణ



కాకినాడ రూరల్, ఫిబ్రవరి 8: కాకినాడ నూతన డీఈవోగా పిల్లి రమేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో నెల్లూరు, ప్రకాశం జిల్లాల విద్యాశాఖాధికారిగా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి పాఠశాలను సందర్శించి విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు ఎలా ఉన్నాయో తెలుసుకుని దాని ఆధారంగా పలు సూచనలు చేస్తానన్నారు. ప్రభుత్వ పరంగా విద్యాశాఖ అమలు చేస్తున్న పథకాలపై వివరించనున్నామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది, కాకినాడ జిల్లా ఎస్టీయూ సంఘ నాయకులు, యూటీఎఫ్ నాయకులు, జిల్లాలోని వివిధ మండలాల ఎంఈవోలు అభినందించారు.

నేడు తునికి షర్మిల రాక

- ఏర్పాట్లు పరిశీలించిన కాంగ్రెస్ అగ్రనేతలు

తుని రూరల్, ఫిబ్రవరి 8: కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల శుక్రవారం తునికి రానున్నారు. రోడ్‌షో అనంతరం తునిలోని గొల్లప్రోలు సెంటర్‌లో నిర్వహించే బహిరంగ సభలో ఆమె ప్రసంగించనున్నారు. ఈ నేపథ్యంలో మాజీ కేంద్రమంత్రి ఎంఎం పళ్లంరాజు, జిల్లా ఇన్‌చార్జ్ డాక్టర్ చిలుకోటి పాండురంగారావుతో కలిసి సభ ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా పళ్లంరాజు మాట్లాడుతూ రాష్ట్రానికి జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ సేవలు అవసరమని, పోలవరం పూర్తితోపాటు ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. శుక్రవారం జరగనున్న కార్యక్రమానికి ప్రజలు తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు.

16న దేశవ్యాప్త గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మె

- రైతు, కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం పిలుపు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 8: కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాలు, రైతు కూలీ సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 16న తలపెట్టిన గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను విజయవంతం చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. కాకినాడ సీఐటీయూ కార్యాలయంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుమలశెట్టి నాగేశ్వరరావు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజబాబు, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లూరి రాజబాబు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, సీపీఎం జిల్లా కన్వీనర్ మోర్త రాజశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేఎస్ శ్రీనివాస్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి రాజు మాట్లాడారు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్, మతోన్మాద విధానాలు రైతుల పాలిట ఉరితాడులా మారి ఐదేళ్లలో 3లక్షలమంది ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. మోదీ తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికులను బానిసలుగా మార్చాయన్నారు. సమావేశంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియర్ జిల్లా కోశాధికారి రవణమ్మ, నగర కార్యదర్శి జ్యోతి, పలు సంఘాల నాయులు రంగాల ఈశ్వరరావు, కళ్ల నాగేశ్వరరావు, సత్యనారాయణ, జుత్తుగ శ్రీను పాల్గొన్నారు.

నేడు చొల్లంగి తీర్థానికి ఏర్పాట్లు పూర్తి

కరప, ఫిబ్రవరి 8: చొల్లంగి అమావాస్య సందర్భంగా కరప మండలం ఉప్పలంక మొండివద్ద జరిగే చొల్లంగి తీర్థానికి దేవదాయ, ధర్మదాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీబాలాత్రిపుర సుందరి సమేత సంగమేశ్వరస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉచిత ప్రసాదం, తాగునీరు, వైద్యశిబిరాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా యానాంనుంచి కాకినాడ వచ్చే వాహనాలు జొంకాయలతూము నుంచి గొర్రిపూడి మీదుగా, కాకినాడనుంచి యానాం వైపు వెళ్లే వాహనాలు ఉప్పలంక నుంచి తూరంగి, నడకుదురు, గురజనాపల్లి మీదుగా ట్రాఫిక్ మళ్లించినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

మొబీ ట్రాక్ ద్వారా 250 సెల్‌ఫోన్లు బాధితులకు అందజేత

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 8: కాకినాడ జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మొబీ ట్రాక్ ద్వారా లభ్యమైన సెల్‌ఫోన్లను బాధితులకు గురువారం అందజేశారు. కాకినాడ పోలీస్ అందిస్తున్న ఈ సేవలకు విశేష స్పందన లభిస్తోంది. రికవరీ చేసిన 250 సెల్‌ఫోన్లను జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ బాధితులకు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మిస్ అయిన, చోరీకి గురైన సెల్‌ఫోన్ల రికవరీ కోసం మొబీ ట్రాక్ కాకినాడ పోలీస్ పేరుతో 9490617852 వాట్సాప్ నెంబర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఫోన్ పోయిన వెంటనే ఈ నెంబర్‌కు హాయ్, హలో అని ఏదైనా మెసేజ్ చేయాలన్నారు. మెసేజ్ వచ్చిన తర్వాత లింక్‌లో వివరాలు నమోదు చేసి పోలీసు సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సెల్‌ఫోన్ల రికవరీ కోసం విశేష కృషి చేస్తున్న ఐటీ కోర్ టీం, సీఐ పి.శ్రీనివాసరావు, బృంద సభ్యులు, సంబంధిత పోలీస్‌స్టేషన్ల ఎస్ఐలు, సీఐలు, డీఎస్పీలు, సిబ్బంది సేవలు అభినందనీయమన్నారు. చోరీకి గురైన ఖరీదైన సెల్‌ఫోన్లను రికవరీ చేసి తమకు అందించిన ఎస్పీ సతీష్‌కుమార్, పోలీసు అధికారులు, సిబ్బందికి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఎస్బీ డీఎస్పీ సీహెచ్ రామకోటేశ్వరరావు, ఐటీ కోర్ సీఐ పి.శ్రీనివాసరావు, డీసీఆర్బీ సీఐ ఈశ్వరుడు, దిశ సీఐ పి.రామచంద్రరావు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్లు, (ఇన్‌సెట్)లో మహిళకు ఫోన్ అందజేస్తున్న ఎస్పీ

తెగుళ్ల ఉధృతి తీవ్రతరం

- రబీ వరిసాగులో రైతుల ఇక్కట్లు
- అధికారుల క్షేత్రస్థాయి పరిశీలనలు కరువు
- పిచికారీలకైనా రాయితీలపై స్ప్రేయర్లు ఏవీ
- నిధులు లేక కానరాని వ్యవసాయాభివృద్ధి



కాండం తొలుచు పురుగును చూపిస్తున్న రైతు

సామర్లకోట, ఫిబ్రవరి 8: దాళ్వా వరిసాగులో పలు ప్రాంతాల్లో కాండం తొలుచు పురుగుల వ్యాప్తితో రైతులు కలవరం చెందుతున్నారు. కాకినాడ వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో సామర్లకోట, పెదపూడి, కాకినాడ రూరల్ మండలాల్లో రైతులు ఇప్పటికే సమీప వ్యవసాయాధికారులకు సమాచారం తెలియజేయడంతో వారు క్షేత్రస్థాయిలో పర్యటనలు పూర్తిగా విస్మరించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వీడియో కాన్ఫరెన్స్‌లతో సమీక్షలు, కాగితాలపై నివేదికలతో మాత్రమే సరిపుచ్చుతున్నారన్న ఆరోపణలు రైతుల నుంచి వినవస్తున్నాయి. అధికారులు గతంలో క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన సదస్సులు, మెళకువలు నిర్వహించేందుకు వ్యవసాయాశాఖనుంచి మాత్రమే గాక వ్యవసాయ మార్కెట్ కమిటీల నిధులను సైతం విడుదల చేసేవారు. వాటిని నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో అధికారులు వారి కార్యాలయాలకే పరిమితమయ్యారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. గత ప్రభుత్వంలో చిన్న రైతులకు సైతం ఎంతగానో ఉపయోగపడే పవర్ స్ప్రేయర్లు సైతం రాయితీలపై ఇచ్చేవారు. వాటిని తాము సాగుచేస్తున్న రైతులు, కౌలుదారులు ఆ స్ప్రేయర్లతో మందులను పంటలపై పిచికారీ చేసి వ్యవసాయంలో నష్టాల నుంచి కొంతమేర బయటపడేవారు. వైసీపీ ప్రభుత్వంలో ఏ ఒక్క రైతుకూ పవర్ స్ప్రేయర్లు పంపిణీ చేసిన దాఖలాలు లేవు. దీంతో సహజంగానే పంటల సాగులో పెట్టుబడుల భారం మరింతగా పెరిగిందని రైతులు వాపోతున్నారు. గోదావరి కాలువలో నీటి విడుదల తగ్గిపోవడం, విడుదలైన నీరు ఎగువ ప్రాంతాల్లో ఎత్తిపోతల పథకాలకు మళ్లించడంతో పిఠాపురం బ్రాంచి కెనాల్‌కు అసలు నీరే పారడం లేదని పీబీసీ రైతులు ఆందోళన చెందుతున్నారు.

పొలంలో తెగుళ్ల వ్యాప్తి ఇలా..

వరిదుబ్బు కాండం లోపల కణుపుల మధ్య భాగమంతా నల్లగా మారడం, ఆకులు పసుపు రంగులోకి మారడం, పిలకలు కిందికి వాలిపోయి క్రమంగా దుబ్బు అంతా ఎండిపోతోంది. ఎండిన పిలకలను చీల్చి చూస్తే లోపలి భాగంలో నల్లని చిన్నచిన్న శిలీంధ్ర బీజాలు కనిపిస్తాయి. దీనిపై వ్యవసాయ ఉన్నతాధికారి దృష్టికి తీసుకువెళ్లగా తెగులు సోకిన పొలంలో పరిశుభ్రత పాటించాలని, మురుగు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త పడాలని సూచించారు. పైరు ఆరోగ్యంగా ఎదిగేలా పోషకాలు ఇదే సమయంలో అందించాలి. ప్రారంభదశలో తెగులు లక్షణాలను గుర్తించి హెక్సాకొనజోల్ 2 మి.లీ. మందు లేదా కార్బండైజిమ్ 1గ్రాము మందు లేదా వాలిడామైసిన్ మందు ద్రావణాన్ని ఏదైనా ఒకదాన్ని తీసుకుని లీటరు నీటికి కలిపిన ద్రావణాన్ని 15 రోజులకు ఒకసారి రెండు దఫాలు దుబ్బు పిలకలు తడిచే వరకూ పిచికారీ చేయడం ద్వారా పంటలపై తెగుళ్ల కారణంగా నెలకొనే నష్టాన్ని కొంతమేర తగ్గించుకోవచ్చు.



పిఠాపురం-కాకినాడ జాతీయ రహదారిపై

గొల్లప్రోలు సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద..





మంచు దుప్పటి

పిఠాపురం/గొల్లప్రోలు, ఫిబ్రవరి 8: జాతీయ రహదారి పరిసరాలు, రహదారులు, పంట పొలాలు, భవనాలను గురువారం తెల్లవారుజామున మంచు దుప్పటి కప్పేసింది. ఉదయం పది గంటల వరకూ అలుముకున్న మంచుతో రహదారులపై వెళ్లే వాహనదారులు లైట్లు వేసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. తెల్లవారుజామున రోడ్లపై ఏమీ కనిపించకపోవడంతో గంటన్నర పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. చలితీవ్రత కొంత మేర తగ్గుముఖం పట్టి, పగటి పూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో గురువారం భిన్నమైన వాతావరణం కనిపించింది. పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలతో పాటు 216వ జాతీయ రహదారి, పంట పొలాలను మంచు కప్పేసింది. గొల్లప్రోలు టోల్‌ప్లాజా వద్ద వాహనాలు దగ్గరకు వచ్చే వరకూ కనిపించని పరిస్థితి నెలకొంది. గొల్లప్రోలు, పిఠాపురం పట్టణాల్లో భవనాలపై పొగమంచు ఆవరించింది. ఇంత దట్టంగా పొగమంచు ఆవరించడం ఇదే తొలిసారి అని పలువురు తెలిపారు.

వాడపల్లి ఆలయానికి డీసీ హోదా

డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన కిశోర్‌కుమార్



ఆత్రేయపురం, ఫిబ్రవరి 8: రాష్ట్రంలో వార్షిక ఆదాయం రూ.5 కోట్లు పైబడి వస్తున్న ఆలయాలకు ప్రభుత్వం ఎట్టకేలకు డిప్యూటీ కమిషనర్ హోదా కల్పించింది. ఏడాది క్రితమే ప్రభుత్వం ప్రతిపాదనలు రూపొందించి పరిపాలనా ఆమోదం పొందగా కేబినెట్ తీర్మానం పొందింది. ఆ దిశగా రాష్ట్రంలో ప్రధాన ఆలయాలకు డీసీ, ఏసీ హోదాలు దక్కాయి. ఇందులో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి వార్షిక ఆదాయం రూ.12 కోట్లకు పైగా చేరుకుంది. రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోంది. ప్రస్తుతం గ్రేడ్-1 ఈవోగా ముదునూరి సత్యనారాయణరాజు పని చేస్తున్నారు. ఆలయానికి డీసీ హోదా లభించడంతో సదరు గ్రేడ్ అధికారిని నియమిస్తూ దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ ఆదేశాలు జారీ చేశారు. విజయనగరం జిల్లా రామతీర్థం ఆలయ సహాయ కమిషనర్ భూపతిరాజు కిశోర్‌కుమార్ పదోన్నతి పొంది ఉప కమిషనర్ హోదాలో వాడపల్లి ఆలయ ఈవోగా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కిశోర్‌ను ఆలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు. డీసీ హోదా దక్కడంతో పరిపాలనా సౌలభ్యంతో పాటు భక్తుల సమస్యలను సకాలంలో పరిష్కరించగలగడం, అభివృద్ధి పనులపై త్వరితగతిన నిర్ణయం తీసుకునే అధికారం ఆయనకు ఉంది.



బాధ్యతలు స్వీకరిస్తున్న కిశోర్‌కుమార్

ఉత్తరకంచి స్టేట్‌బ్యాంక్‌లో భారీ చోరీ

- బ్యాంకు వెనుక నుంచి చొరబడిన దుండగులు
- రూ.25 లక్షల నగదు, రూ.50 లక్షల బంగారం అపహరణ



ప్రత్తిపాడు, ఫిబ్రవరి 8: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఉత్తరకంచి స్టేట్‌బ్యాంక్‌లో భారీ చోరీ జరిగింది. బ్యాంక్ కార్యాలయం వెనుక ఉన్న ఇనుప కిటికీని గ్యాస్ కట్టర్‌తో తొలగించి దుండగులు చోరీకి పాల్పడ్డారు. బుధవారం అర్ధరాత్రి దాటాక ఈ చోరీ జరిగింది. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ఉత్తరకంచి మూడు రోడ్ల జంక్షన్ సమీపంలో పెద్దిపాలెం రహదారి మార్గంలో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ శాఖలో దుండగులు చొరబడ్డారు. బ్యాంక్ కార్యాలయం వెనుక భాగాన ఉన్న కిటికీ ఇనుప గ్రిల్‌ను గ్యాస్ కట్టర్‌తో కట్ చేసి ఆ మార్గం గుండా దుండగులు బ్యాంకులోకి ప్రవేశించారు. బ్యాంకులోని అలారం, సీసీ కెమెరాలు పని చేయకుండా చేసి చాకచక్యంగా చోరీకి పాల్పడ్డారు. బ్యాంక్ స్ట్రాంగ్ రూంలోని రెండు లాకర్లు తెరిచి వాటిలో రూ.25 లక్షలు నగదు, మరో 50 లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలను దుండగులు అపహరించారు. గురువారం ఉదయం బ్యాంకుకు వచ్చిన అధికారులు చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, పెద్దాపురం డీఎస్పీ లతా కుమారి, ప్రత్తిపాడు సీఐ ఎం.శేఖర్‌బాబు, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, కిర్లంపూడి ఎస్‌ఐలు పవన్‌కుమార్, సతీష్, జబీర్‌లతో పాటు జగ్గంపేట, అన్నవరం, రౌతులపూడి ఎస్‌ఐలు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎస్పీ దుండగులు చొరబడ్డ బ్యాంక్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ చోరీకి ఆరుగురు వ్యక్తులు పాల్పడినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. క్లూస్‌టీం, డ్యాగ్ స్క్వాడ్‌లు రప్పించి తనిఖీలు చేపట్టారు. ఈ చోరీ సంఘటనపై ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ కోటి రూపాయలు సొత్తు చోరీకి గురైందని రూ.25 లక్షలు నగదు, మరో రూ.50 లక్షలు బంగారం ఉందని తెలిపారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందం ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ఉత్తరకంచి ఎస్‌బీఐలో చోరీ జరిగిందనే విషయం తెలిసి ఆ బ్యాంక్ పరిధిలోని ఖాతాదారులు, ప్రజలు బ్యాంకు వద్దకు తరలివచ్చారు. మెయిన్ రోడ్డులో ఉన్న బ్యాంక్‌లో చోరీ జరగడంతో స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. డాగ్ స్క్వాడ్ బ్యాంకు పరిసరాల్లో కలియతిరిగాయి. క్లూస్‌టీం బృందం లాకర్లు, స్ట్రాంగ్ రూంల వద్ద వేలి ముద్రలు సేకరించింది.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ సతీశ్‌కుమార్

ఇళ్ల పట్టాల పంపిణీపై సమగ్ర విచారణ జరిపించాలి

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి డిమాండ్



నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఆందోళన

బిక్కవోలు, ఫిబ్రవరి 8: అనపర్తి నియోజకవర్గంలో ఇళ్ల పట్టాల పంపిణీపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో విచారణ జరిపించాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. విలేకర్లతో గురువారం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇళ్ల పట్టాల పంపిణీలో పెద్ద కుంభకోణం జరిగిందని ఆరోపించారు. బిక్కవోలు, బలభద్రపురం గ్రామాల్లో జరిగిన అవకతవకలపై ఆధారాలు తమ వద్ద ఉన్నాయన్నారు. బిక్కవోలులో 180 మంది, బలభద్రపురంలో 140 మందిని ఏ కారణం లేకుండా అనర్హులుగా చేర్చారన్నారు. బిక్కవోలులో 1100 మందికి మాత్రమే ఇళ్ల పట్టాలు ఇచ్చారన్నారు. 180 మంది పేర్లు ఆన్‌లైన్‌లో ఉన్నాయన్నారు. ఆన్‌లైన్‌లో లేని అనర్హులకు పట్టాలు ఇస్తున్నారని ఆయన ఆరోపించారు. బిక్కవోలు ఇళ్ల పట్టాల పంపిణీలో రూ.12 కోట్లు చేతులు మారాయన్నారు. బదిలీపై వెళ్లిపోయిన తహశీల్దార్ పోసిబాబు రాత్రికి రాత్రి గుట్టు చప్పుడు కాకుండా పాత తేదీలతో 120 పట్టాలపై సంతకాలు చేశారని, అలాగే బలభద్రపురంలోనూ అవినీతి బాగోతం వెలుగులోకి వచ్చిందన్నారు. నియోజకవర్గమంతా ఇదే పరిస్థితి ఉందని, అందువల్ల విజిలెన్స్ విచారణ జరపాలని రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా ఇళ్ల పట్టాలకు దరఖాస్తు చేసుకుని పట్టాలు రాని మహిళలతో కలసి గురువారం ఆయన బిక్కవోలు టీడీపీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయానికి పాదయాత్రగా చేరుకుని ఆందోళన చేపట్టారు. అనంతరం కార్యాలయ ఇన్‌చార్జికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, పల్లి వాసు, గొర్రెల త్రిమూర్తులు, రాయుడు రామచంద్రరావు, నల్లమిల్లి వెంకటసుబ్బారెడ్డి, సింగారపు రామారావు, రమేష్, సిద్ధు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో రెవెన్యూ కేసులు అధిక సంఖ్యలో పరిష్కారమవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న గంధం సునీత

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మార్చి 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో రెవెన్యూ శాఖకు సంబంధించిన కేసులు పెద్ద సంఖ్యలో పరిష్కారం కావడానికి చర్యలు తీసుకోవాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత ఆదేశించారు. ఉమ్మడి తూర్పుగోదావరిలోని రెవెన్యూ అధికారులతో ఆమె గురువారం సమావేశమయ్యారు. లోక్ అదాలత్‌లో పరిష్కారం పొందే కేసులకు కోర్టు ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని, ఇరుపక్షాలకు అంగీకారమైన పరిష్కారం లభిస్తుందన్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించి రాజీకి అర్హమైన కేసుల జాబితాను జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు అందజేయాలని సూచించారు. జీపీ సీహెచ్‌వీ ప్రసాద్, ఏజీపీ సీపీఆర్ రెడ్డి, కేఆర్ ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ ఆర్.కృష్ణనాయక్, కార్యదర్శులు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి కేరళకు చెందిన వ్యక్తి మృతి

తుని రూరల్, ఫిబ్రవరి8: రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కేరళకు చెందిన అఖిల్‌జార్జ్ (24) విశాఖపట్నం క్రికెట్ మ్యాచ్ వీక్షించేందుకు వచ్చి తిరిగి వెళుతుండగా ఈ నెల 3,4 తారీఖుల్లో గుర్తు తెలియని రైలు నుంచి జారిపడినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. అన్నవరం రావికంపాడు మధ్య జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి రావడంతో మృతదేహం పూర్తిగా గుర్తుపట్టలేని విధంగా మారిందని కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ షేక్ అబ్దుల్‌మారుఫ్ తెలిపారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులపై దృష్టి సారించాలి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వీసీ కె.పద్మరాజు

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 8: కేవీకే సహకారంతో భవిష్యత్‌లో ప్రకృతి వ్యవసాయ సూత్రాలు, బయోకల్చర్స్ తయారీపై విశ్వవిద్యాలయం వృక్షశాస్త్ర విభాగం దృష్టి సారించాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వీసీ కె.పద్మరాజు అన్నారు. కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం సౌజన్యంతో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో వృక్షశాస్త్ర విభాగపు సువాస ది స్టూడెంట్ క్లబ్ తరఫున ప్రకృతి వ్యవసాయం, బయోకల్చర్ తయారీపై శిక్షణ, వర్క్‌షాపును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ పద్మరాజు మాట్లాడుతూ విద్యార్థులు కేవలం ఐటీ రంగంపై ఆధారపడకుండా ప్రకృతి, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ఫుడ్ ప్రాసెసింగ్‌పై దృష్టి సారించాలన్నారు. జిల్లాలోని 18 మండలాల్లో దాదాపు 30 వేల మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేపట్టారని జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు, ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్ (ఏపీసీఎన్‌ఎఫ్) జిల్లా ప్రాజెక్టు మేనేజర్ బి.తాతారావు తెలిపారు. ముఖ్యంగా పంట పోషణకు, రక్షణకు సంబంధించి 22 రకాల బయోకల్చర్స్‌ను ఏవిధంగా తయారు చేసుకోవాలో ప్రదర్శనగా చూపారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం హెడ్ వీఎస్‌జీఆర్ నాయుడు, నన్నయ వర్సిటీ వృక్ష శాస్త్ర విభాగం ఆచార్యులు వి.పద్మావతి, ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల కోర్స్ కోఆర్డినేటర్ కె.సామ్యూల్‌కుమార్ ఎల్.ముత్యాలనాయుడు, కేవీకే అధికారులు జీవీఆర్ సత్యవాణి, దిలీప్, విజయ్‌వర్ధన్, ప్రభాత్‌నాయుడు, ఎంఏ రాజు, రత్నాజీ ఏపీసీఎన్‌ఎఫ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో బాధ్యతగా వ్యవహరించాలి

విద్యార్థులు, అధ్యాపకులు విద్యతో పాటు సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించాలని, సమాజ హితంగా జీవించాలని ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో గురువారం బోర్డ్ ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ త్రూ ఎడ్యుకేషన్ (బీసీడీఈ) అనే అంశంపై వర్క్‌షాపు నిర్వహించారు. దీనికి వీసీ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ బీసీడీఈ కళాశాలల కోఆర్డినేటర్‌లకు, స్టూడెంట్ అంబాసిడర్లకు అవగాహన కల్పించి విద్యార్థులను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీసీడీఈ కార్యదర్శి, సీఈవో ఆచార్య ఎంఎల్‌ఎస్ దేవకుమార్, కన్సల్టెంట్ కె.సిమ్రాన్, నన్నయ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, బీసీడీఈ యూనివర్సిటీ కోఆర్డినేటర్ బి.జగన్మోహనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీసీ పద్మరాజు

టీవీ సీరియల్‌లో అవకాశం ఇప్పిస్తామని వ్యభిచార రొంపిలోకి..

దంపతులకు ఏడేళ్ల జైలు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): టీవీ సీరియల్‌లో నటిగా అవకాశం కల్పిస్తామని మాయమాటలు చెప్పి ఒక మహిళను నిర్బంధించి అత్యాచారం, వ్యభిచారం చేయించిన కేసులో భార్యాభర్తలకు ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఏవీ అప్పారావు రోడ్ శ్రీనివాసనగర్‌కు చెందిన లంక చమక్క, లంక నాగరాజు దంపతులు ఒక మహిళకు టీవీ సీరియల్‌లో అవకాశం ఇప్పిస్తామని మాయమాటలు చెప్పి ఓ చోట నిర్బంధించారు. నాగరాజు ఆమెపై అత్యాచారం చేశాడు. పాలలో మత్తు పదార్థాలు కలిపి తాగించి వ్యభిచారం చేయించారు. బాధిత మహిళ ఫిర్యాదుతో 2021 నవంబరు 13న ప్రకాశ్‌నగర్ సీఐ ఆర్‌జే రవి కుమార్ కేసు నమోదు చేశారు. ఎస్పీ జగదీశ్ వచ్చిన తర్వాత స్పీడీ ట్రైల్ పేరుతో విచారణలో ఉన్న కేసులను వేగవంతం చేసే చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో సెంట్రల్ జోన్ డీఎస్పీ విజయ్‌పాల్ స్వీయ పర్యవేక్షణలో ప్రకాశం నగర్ ప్రస్తుత సీఐ కేవీఎస్ సత్యనారాయణ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఈ క్రమంలో నిందితుడిపై నేరం రుజువు కావడంతో శిక్ష విధిస్తూ గురువారం కోర్టు తీర్పు వెలువరించింది. నిందితుడిపై నేరం రుజువు చేయడంలో ప్రతిభ చూపిన డీఎస్పీ, సీఐతో పాటు కోర్టు హెచ్‌సీ పి.కొండలరావును ఎస్పీ జగదీశ్ అభినందించారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ మారిశెట్టి వెంకటేశ్వరరావు వాదనలు వినిపించారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

రంపచోడవరం, ఫిబ్రవరి 8: రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ చెప్పారు. రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్లకు గురువారం ఈవీఎం, వీవీ ప్యాట్స్‌పై కలెక్టర్ అవగాహన కల్పించారు. ఐటీడీఏ పీవోలు సూరజ్ గనోరే, కావూరి చైతన్య, సబ్ కలెక్టరు ఎస్.ప్రశాంత్‌కుమార్ కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల సరళిపై 66 పేజీల హ్యాండ్ బుక్ రూపొందించినట్లు తెలిపారు. ఎన్నికలు జరిగే రోజున ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. సెక్టారు అధికారులకు ఎన్నికల సరళిపై శిక్షణ ఇవ్వనున్నామన్నారు. ఏడు పోలింగ్ కేంద్రాలకు ఒక సెక్టారు అధికారిని నియమించినట్లు తెలిపారు. దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకొనేందుకు ప్రత్యేక సదుపాయం కల్పించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్లు వీవీ రమణ, చెల్లయ్య, సువర్ణ, ఫణి, పీఎస్ కుమార్, డీటీలు ఎన్‌వీవీ సత్యనారాయణ, సుబ్బారావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్, సీనియర్ అసిస్టెంట్లు ఇందిరాబాయి, లక్ష్మణ్ పాల్గొన్నారు.



మరిడమ్మ ఆలయ ఆదాయం లెక్కింపు

పెద్దాపురం, ఫిబ్రవరి 8: మరిడమ్మ హుండీల ఆదాయాన్ని దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో గురువారం లెక్కించారు. దేవస్థానం ఏసీ చేబ్రోలు రామ్మోహనరావు ఆధ్వర్యంలో ఈ లెక్కింపు ప్రక్రియ నిర్వహించారు. 180 రోజుల కాలానికి రూ.6,07,435 ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ట్రస్టీ డాక్టర్ చింతపల్లి బ్రహ్మాజీ, దేవదాయ శాఖ డివిజినల్ ఇన్‌స్పెక్టర్ చల్లా ఉదయబాబునాయుడు తదితరులు పాల్గొన్నారు.

మేరీమాత ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక హాల్ట్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): గుణదలలోని మేరీమాత ఉత్సవాల సందర్భంగా ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకూ రామవరప్పాడులో పలు రైళ్లకు దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక స్టాప్ సదుపాయం కల్పించింది. రైలు నెం.17479 పూరి-తిరుపతి, 17481 బిలాస్‌పూర్-తిరుపతి, 17480 తిరుపతి-పూరి, 17482 తిరుపతి-బిలాస్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లను రామవరప్పాడులో నిలుపుదల చేస్తారని విజయవాడ డివిజన్ ప్రజా సంబంధాల అధికారిణి నుస్రత్ ఎం మండ్రూప్‌కర్ తెలిపారు. భక్తులు గమనించాలని ఆమె కోరారు.

వ్యక్తి ఆత్మహత్య

సోదరుడి ఫిర్యాదుతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

పిఠాపురం, ఫిబ్రవరి 8: పిఠాపురం పట్టణంలో ఒక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే అతని సోదరుడు అనుమానాలు వ్యక్తం చేయడంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. పిఠాపురం పట్టణంలోని అగ్రహారంలో నివాసముంటున్న అనుపోజు శివ(29), అతని భార్య సుధారాణికి మధ్య కొద్ది రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి తమ్ముడు దత్తకు ఫోన్ చేసి బయటకు వెళదామని చెప్పడంతో ఇద్దరు కలిసి బయటకు వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చారు. అక్కడ నుంచి దత్త ఇంటికి వెళ్లిన కొంత సమయానికి శివ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు సమాచారం ఇచ్చారు. దీంతో అన్నయ్య ఇంటికి తిరిగి వచ్చాడు. అప్పటికే శివ మృతదేహాన్ని బయటకు తీసుకువచ్చారు. ఆ సమయంలో భార్య సుధారాణి ఇంటి వద్ద లేదని చెబుతున్నారు. కాగా తన సోదరుడు శివ మృతిపై అనుమానాలు ఉన్నాయని దత్త పిఠాపురం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తాడి నరసింహారావుకు మాతృ వియోగం



పరామర్శిస్తున్న నేతలు

ముమ్మిడివరం, ఫిబ్రవరి 8: తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, తాడి నరసింహారావు మాతృమూర్తి, సినీ నిర్మాత, ప్రముఖ వ్యాపారవేత్త తాడి తాతారావు సతీమణి పొన్నమ్మ(70) బుధవారం రాత్రి మృతిచెందారు. పొన్నమ్మకు నరసింహారావు, జానకీరామ్ కుమారులు కాగా, కుమార్తె రమణీకుమారి ఉన్నారు. ఇటీవల అస్వస్థతకు గురైన పొన్నమ్మ స్వగృహంలో వైద్య సేవలు పొందుతూ మృతి చెందారు. పొన్నమ్మ భౌతికకాయాన్ని మాజీ ఎమ్మెల్యేలు దాట్ల బుచ్చిబాబు, చెల్లి వివేకానంద, జనసేన పార్టీ రాష్ట్ర పీఏసీ సభ్యుడు పితాని బాలకృష్ణ సందర్శించి నివాళులర్పించారు. నరసింహారావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట నాయకులు గొలకోటి దొరబాబు, చెల్లి అశోక్, పొద్దోకు నారాయణరావు, పేరాబత్తుల రాజశేఖర్, అర్థాని శ్రీనివాస్, దొమ్మేటి రమణకుమార్, గోదశి పుండరీస్, కట్టా సత్తిబాబు, దూడల స్వామి, ములపర్తి బాలకృష్ణ, దాట్ల బాబు, కడలి నాగు, అడబాల సతీష్, మెండి కమల చిక్కాల అంజిబాబు, యాళ్ల ఉదయ్, కురసాల శివబాలు, గొల్లపల్లి గోపి తదితరులు ఉన్నారు. అలాగే పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, బీజేపీ నాయకుడు యాళ్ల దొరబాబు తదితరులు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మెడికల్ కాలేజీల్లో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

జీజీహెచ్ (కాకినాడ), ఫిబ్రవరి 8: రాజమహేంద్రవరం జోన్-2 పరిధిలో కొత్తగా మంజూరైన రాజమహేంద్రవరం, ఏలూరు, మచిలీపట్నం మెడికల్ కాలేజీలు, కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీలో ఫిజికల్ డైరెక్టర్ నాలుగు పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకులు పి.పద్మాశశిధర్, డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. వీటితో పాటు పీహెచ్‌సీల్లో ఖాళీగా ఉన్న ఫార్మాసిస్ట్ గ్రేడ్-2 20 పోస్టులను కాంట్రాక్ట్ విధానంలో భర్తీ చేస్తామన్నారు. ఈనెల 20వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు అర్హత కలిగిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేయాలన్నారు.

https://eastgodavarai.ap.gov.in
https://kakinada.ap.gov.in,
https://konaseema.ap.gov.in,
https://eluru.ap.gov.in,
https://westgodavari.ap.gov.in,
https://krishna.ap.gov.in,
https://ntr.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు పొందుపరిచామని తెలిపారు.

నర్సరీని సందర్శించిన నటుడు శ్రవణ్



కడియం, ఫిబ్రవరి 8: టాలీవుడ్ దిగ్గజ నటులు నటించిన చిత్రాల్లో ప్రతినాయకుడి పాత్రలను పోషించిన నటుడు శ్రవణ్ గురువారం పల్ల వెంకన్న నర్సరీని సందర్శించారు. ఆయనకు నర్సరీ డైరెక్టర్ పల్ల వినయ్ మొక్కను అందజేసి స్వాగతించారు. దేశ, విదేశాల మొక్కలతో కడియం నర్సరీలు శోభాయమానంగా ఉన్నాయని శ్రవణ్ అన్నారు.

బాల్య వివాహాలు చట్ట విరుద్ధం

తునిరూరల్, ఫిబ్రవరి 8: బాల్యవివాహాలు చట్ట విరుద్ధమని మాతా శిశు సంక్షేమాధికారి కె.శ్రీలతా తెలిపారు. రాజుపేట గ్రామంలో బేటీ పచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు. బాల్య వివాహాలవల్ల చోటు చేసుకునే అనర్థాలు వివరిస్తూ ఆడపిల్ల విద్య ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బుద్దాల సత్తిబాబు, ఎంపీడీవో గిరిజాల సుబ్రహ్మణ్యం, వడ్డాది ఏసుబాబు, కిల్లాడ గోవిందు, సూపర్‌వైజర్ విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

టీడీపీలో పలువురి చేరిక

తొండంగి, ఫిబ్రవరి 8: తుని నియోజకవర్గంలో టీడీపీలోకి చేరికలు ప్రారంభమయ్యాయని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి యనమల కృష్ణుడు తెలిపారు. గురువారం ఒంటిమామిడి పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో దానవాయిపేట వైసీపీకి చెందిన మత్స్యకారులు భారీ సంఖ్యలో టీడీపీలో చేరారు. కందాల జార్జి, చొక్కా బాబ్జి, బాగేష్, కందాల కొండలరావు, యజ్జల చిన్నా,బొందు సూరిబాబు, మడదా హరిబాబు, కారే గోపి చోడిపల్లి దేవుడు తదితరులకు కృష్ణుడు పార్టీ కండవాలు కప్పి వారిని సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా మత్స్యకార అధ్యక్షుడు కోడ వెంకటరమణ, మాజీ జడ్పీటీసీ చొక్కా కాశీశ్వరరావు, తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పేకేటి హరికృష్ణ పాల్గొన్నారు.

వైసీపీ నుంచి పలువురు టీడీపీలో చేరిక



టీడీపీలోకి చేరిన వారితో నెహ్రూ

జగ్గంపేట, ఫిబ్రవరి8: జగ్గంపేట మండలం కాండ్రేగుల నుంచి రోజురోజుకీ వైసీపీ నుంచి టీడీపీలో వలసలు పెరుగుతూనే వస్తున్నాయి. గురువారం కాండ్రేగుల మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ రామిశెట్టి చంద్రరాబు ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన బొదిరెడ్డి సూరిబాబు, నాగిరెడ్డి చెల్లారావు, కంపిరి సత్తిబాబు, అడపా చిన్నోడు, నిమ్మల వెంకట దుర్గ, తోట దుర్గ, తదితర 15 కుటుంబాలు రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి నెహ్రూ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో సుంకవిల్లి రాజు, యల్లపు దొరబాబు,రామిశెట్టి పాపారావు, ఐటీడీపీ కామన చక్రధర్, రామిశెట్టి విష్ణు, చక్రరావు, బాబులు, పాతంశెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్లపట్టాలు ఇవ్వాలని టీడీపీ ఆందోళన

పిఠాపురం, ఫిబ్రవరి 8: అర్హులైన వారికి ఇళ్లపట్టాలు ఇవ్వలేదంటూ పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ ఆధ్వర్యంలో మునిసిపల్ కార్యాలయంవద్ద గురువారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ పట్టణంలోని 15వ వార్డులో భూములు, ఆస్తులు ఉన్నవారికే పట్టాలు ఇచ్చారని తెలిపారు. వైసీపీ నేతలు, వలంటీర్లు అర్హత ఉన్న వారికి ఇళ్లస్థలాలు రాకుండా చేశారని ఆరోపించారు. అధికారులు మరోమారు సమగ్ర పరిశీలన జరిపి అర్హులందరికీ ఇళ్లపట్టాలు ఇవ్వాలని కోరుతూ మునిసిపల్ కమిషనర్ కనకారావుకు వినతిపత్రం అందజేశారు. ఆందోళనలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు రెడ్డెం భాస్కరరావు, నాయకులు పిల్లి చిన్నా, కొండేపూడి సూర్యప్రకాష్, దేవరపల్లి రామారావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నేడు నులి పురుగుల నివారణ కార్యక్రమం

కరప, ఫిబ్రవరి 8: జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు, పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు ఆల్బెండోజోల్ మాత్రలు మింగించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు మండల వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాసనాయక్ తెలిపారు. ఒక సంవత్సరం వయస్సు నిండిన పిల్లల నుంచి 18ఏళ్లలోపు వారికి ఈ మా త్రలు మింగించడం జరుగుతుందన్నారు. వేళంగి పీహెచ్‌సీ పరిధిలో 5140 మంది చిన్నారులు, విద్యార్థులు ఉన్నారని, వీరందరినీ ఆల్బెండోజోల్ మాత్రలు మింగించేందుకు ఏర్పాట్లు చేసినట్లు డాక్టర్ ఎంకే సౌజన్య తెలిపారు.

కొనసాగిన పింఛన్‌దారుల రిలే దీక్షలు

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి8: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పింఛన్‌దారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బోట్ క్లబ్‌వద్దగల ఈపీఎఫ్ కార్యాలయం ఎదురుగా పింఛన్‌దారులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాలుగోరోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఏపీ రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి సీహెచ్ సత్యనారాయణరాజు, పోస్టల్ రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి తురగా సూర్యారావు మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలపట్ల చాలానిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందన్నారు. ఉద్యోగులకు 8వ పీఆర్‌సీ ప్రకటించకుండా కుంటిసాకులు చెబుతోందన్నారు. పదేళ్లుగా ఈపీఎఫ్ పెన్షనర్ల సమస్యలకోసం అలుపెరుగని పోరాటం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు, జిల్లా సహాధ్యక్షుడు జోగా అప్పారావు, జిల్లా కార్యదర్శి యుఎస్ఎన్ కె.రెడ్డి, పి.రమణ, బి.అశోక్, కె.పట్టాభిరామారావు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో కొనసాగిన ఆందోళన

జీజీహెచ్(కాకినాడ), ఫిబ్రవరి 8: సమస్యల పరిష్కారం కోరుతూ కాకినాడ జీజీహెచ్‌లో కాంట్రాక్ట్ శానిటేషన్ వర్కర్ల, సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆందోళన గురువారం నాటికి 8 రోజులకు చేరింది. సీఐటీయూ జిల్లా కోశాధికారి మలక వెంకటరమణ మాట్లాడుతూ 22ఏళ్లుగా జీజీహెచ్‌లో కాంట్రాక్ట్ వర్కర్లుగా పనిచేస్తున్నామన్నారు. కాంట్రాక్ట్ నిర్వాహకులు చెల్లించాల్సిన పీఎఫ్ వాటా సొమ్ము కార్మికుల జీతాలనుంచి కటింగ్ చేయడం దుర్మార్గమన్నారు. పలివెల వీరబాబు, ఆర్ రమేష్, జె.శేషు, వాసు, చంద్రకళ, కుమారి, అరుణ, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

కాంగ్రెస్ మత్స్యకార విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పకీర్‌రాజు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 8: కాంగ్రెస్ మత్స్యకార విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కాకినాడ పాతబస్టాండ్ ఏరియాకు చెందిన లంకే పకీర్ రాజు నియమితులయ్యారు. గురువారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్ మత్స్యకార విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కదిరి జగన్నాథం, రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకటరమణ నియామకపత్రం అందజేశారు.

వైసీపీ పెద్దల తీరుకు మనస్తాపం : అలమండ

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 8: వైసీపీ పార్టీ పెద్దల తీరుకు మనస్తాపం చెందిన వైసీపీపార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు ఏలేశ్వరం నగర పంచాయతీ కౌన్సిలర్ కౌన్సెలర్ అలమండ చలమయ్య చెప్పారు. గురువారం ఏలేశ్వరంలో ఆయన మాట్లాడుతూ ఏలేశ్వరం నగర పంచాయతీ తీర్మానాలకు విరుద్ధంగా పట్టణంతో సంబంధంలేని పార్టీ నేతల వ్యవహారం తనకు బాధ కలిగించిందన్నారు.



యు.కొత్తపల్లి: శౌంరివారిపాకల్లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యేవర్మ



ప్రత్తిపాడు: కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ ఇన్‌చార్జ్ సత్యప్రభ



తుని రూరల్: వి.కొత్తూరులో ప్రచారం చేస్తున్న దివ్య

నాడు-నేడులో రంగుల పేరుతో రూ.3కోట్లు అవినీతి

• టీడీపీ రాష్ట్ర అధికారప్రతినిధి వర్మ

కొండెవరం(కొత్తపల్లి), ఫిబ్రవరి8: వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన నాడు-నేడు కార్యక్రమం పేరుతో పాఠశాలలకు నాసి రంగులు వేసి, విద్యార్థులకు పంపిణీ చేసే ట్యాబ్‌ల్లో రూ.3కోట్ల అవినీతికి పాల్పడ్డారని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికారప్రతినిధి ఎస్వీఎస్ఎన్‌వర్మ ఆరోపించారు. కొండెవరం శివారుశౌంరివారిపాకల్లో గురువారం బాబు ష్యూరిటీ,భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ప్రజావేదికలో ఆయన వైసీపీ ప్రభుత్వం ఈ నాలుగున్నరేళ్లు పాల్పడిన అవినీతిని ఎండగట్టారు. కార్యక్రమంలో టీడీపీ కొత్తపల్లి మండలశాఖ అధ్యక్షులు అనిశెట్టి సత్యానందరెడ్డి, ఎంపీటీసీ దుళ్ళ సత్తిబాబు, టీడీపీ నాయకులు గుత్తుర్తి రమణ, శ్రీను, పిల్లి శ్రీను, రాయుడు నరసింహమరిత్త, కూరాకుల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

'అరాచకపాలనకు చరమగీతం పాడండి'

ప్రత్తిపాడు: రాష్ట్రంలో అరాచక పాలనకు, అక్రమాలకు ప్రజలు చరమగీతం పాడాలని ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జ్ సత్యప్రభ కోరారు. గురువారం గోకవరంపు వీధిలో బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొమ్ముల కన్నబాబు, స్థానిక నాయకులు రావూరి తాతాజీ, లొండా లోవరాజు, పోలిశెట్టి శ్రీనివాస్, యర్రాబత్తుల గోవింద నాయుడు, మదినే స్వామి, వెలుగుల నాని, మాజీ సర్పంచ్ రొంగల యమున, మహిళలు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేనలతోనే భవిష్యత్ గ్యారెంటీ

తునిరూరల్: టీడీపీ, జనసేనల పార్టీలతోనే భవిష్యత్ గ్యారెంటీ అని తుని టీడీపీ ఇన్‌చార్జ్ యనమల దివ్య స్పష్టం చేశారు. వి.కొత్తూరులో మీ ఇంటికి మీ దివ్య కార్యక్రమంలో భాగంగా జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు సుర్ల లోవరాజు, తెలుగు యువత అధ్యక్షుడు యనమల శివరామకృష్ణన్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటా ప్రచారం నిర్వహిస్తు పార్టీ మేనిఫెస్టోపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తమరాన సత్యనారాయణ, మాజీ సర్పంచ్ తమరానవరలక్ష్మి, సత్యనారాయణ,జక్కాన రామునాయుడు, కర్రితాతలు, జనసేన నాయకులుచోడిశెట్టి వెంకటేష్, వంగలపూడి నాగేంద్ర, దూబాసీ ప్రసన్న, పెద్దిరెడ్డి దుర్గాప్రసాద్ తదితరులు ఉన్నారు.

పార్టీ విజయమే లక్ష్యం

శంఖవరం: నియోజకవర్గంలో టీడీపీ విజయమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు అమలాపురం నియోజకవర్గ పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణంరాజు అన్నారు. స్థానిక నేత పర్వత సురేష్‌తో సమావేశమైన ముఖ్యనేతలు ఇతర పార్టీల నుంచి వస్తున్న నేతల విషయాలను చర్చించారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం చీత్కాలను ఎదుర్కొంటుందని, రాష్ట్రాన్ని అధోగతి పాలుచేశారని పర్వత సురేష్ అన్నారు. ఈకార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బద్ది రామారావు, బదిరెడ్డి గోపి, ఓలేటి లక్ష్మీనారాయణ, గోపి, రమేష్, బొర్రా వాసు, ములిక వెంకన్న, రౌతు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులతో పోరాటం ఆపలేరు



తాళ్లరేవు: కోరంగ పోలీసుస్టేషన్‌లో ధర్నాచేస్తున్న ఆశా వర్కర్లు

తుని రూరల్, ఫిబ్రవరి 8:అక్రమ అరెస్టులతో పోరాటం ఆపలేరని ఆశావర్కర్లు, సీఐటీయూ నాయకులు స్పష్టం చేశారు. తునిలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట వీరు ఆందోళన చేపట్టారు. శాంతియుతంగా నిరసన చేపట్టేందుకు విజయవాడ వెళుతున్న ఆశావర్కర్లపై పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై తీవ్రంగా ధ్వజమెత్తారు. తమ న్యాయపరమైన హక్కులు నెరవేర్చాలని కోవిడ్‌లో చనిపోయిన వారికి రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని అసెంబ్లీ సమావేశాల్లో ఆశావర్కర్ల సమస్యలపై చర్చించాలన్నారు. వేతనాలు పెంపు, గ్రాడ్యుటీ అమలు, రిటైర్మెంట్ బెనిఫిట్‌ను కల్పించాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

ఆశా వర్కర్ల అరెస్టులకు నిరసనగా ధర్నా

పెద్దాపురం: విజయవాడ ధర్నాకు వెళుతున్న ఆశా వర్కర్లను అరెస్టుచేయడాన్ని నిరసిస్తూ స్థానిక మున్సిపల్ జంక్షన్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. సామర్లకోట రైల్వేస్టేషన్‌లో అరెస్టుచేసి పెద్దాపురం అంబేడ్కర్ భవనంలో ఉంచడంపై సీఐటీయూ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా నాయకుడు దారపురెడ్డి క్రాంతికుమార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలిపే హక్కును కూడా కాలరాస్తూ వైసీపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు లోవ కుమారి, రమణమ్మ, రామలక్ష్మి, వెంకలక్ష్మి, చింతల సత్యనారాయణ, వడ్డి సత్యనారాయణ, ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల అక్రమ అరెస్టులు

తాళ్లరేవు, ఫిబ్రవరి 8: విజయవాడకు తమ బాధలు చెప్పుకునేందుకు వెళుతున్న ఆశా వర్కర్లను కాకినాడలో బుధవారం మధ్యాహ్నం పోలీసులు అడ్డుకుని అక్రమంగా అరెస్టుచేసి ఒక కళ్యాణమండపానికి తరలించారు. రాత్రి 9గంటలకు వర్కర్లను వ్యానులో రామచంద్రపురం తరలించి గురువారం తెల్లవారుజామున కోరంగ పోలీసుస్టేషన్‌కు ఆశావర్కర్లను తరలించారు. భోజనాలు, టిఫిన్లు లేక ఆశావర్కర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా కులంపేర్లతో పోలీసులు వివక్షత చూపించారని ఆశా వర్కర్లు ఆరోపించారు. టీడీపీనేత ధూళిపూడి వెంకటరమణ, టేకుమూడి లక్ష్మణరావులు మాట్లాడుతూ ఆశావర్కర్ల పోరాటానికి మద్దతుగా ఉంటామన్నారు.మాజీ జడ్పీటీసీ పొన్నమండ రామలక్ష్మి, వాడ్రేవు వీరబాబు, జవ్వాది తాతాజీ, చంద్రాల ఆదినారాయణ, బాబూరావు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

'రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మహిళల నైపుణ్యాభివృద్ధి కేంద్రం'

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 8: రెడ్‌క్రాస్ సంస్థ నిర్వహణలో త్వరలోనే ప్రతాప్‌నగర్‌లోని శిశు, మహిళాభివృద్ధి నైపుణ్య కేంద్రానికి శాశ్వత భవనం సమకూరనుందని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు తెలిపారు. ఇటీవల రాష్ట్ర గవర్నర్ అబ్దుల్‌నజీర్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన నేపథ్యంలో కమిషనర్ వెంకటరావు గురువారం భవనాన్ని సందర్శించారు. అక్కడ నిర్మాణ పనులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావు మాట్లాడుతూ రూ.1.30కోట్ల సీఎస్ఆర్ నిధులతో శాశ్వత భవనాన్ని నిర్మిస్తున్నామన్నారు. అదే ప్రాంగణంలో శిశు గృహాన్ని నిర్మించి మహిళా శిశు సంక్షేమ విభాగానికి అప్పగిస్తామని చెప్పారు. ఎన్నో ఏళ్ల రెడ్‌క్రాస్ ద్వారా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను నిర్వహిస్తున్నామని ఇప్పుడు శాశ్వత భవనాన్ని సమకూరుస్తున్నామని వివరించారు.

సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకం : ఈఆర్వో

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 8: ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు రానున్న ఎన్నికలను పారదర్శకంగా, సజావుగా నిర్వహించడంలో సెక్టోరల్ అధికారుల పాత్ర అత్యంత కీలకమని సిటీ నియోజకవర్గ ఈఆర్వో, నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు అన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో శుక్రవారం సెక్టోరల్ అధికారులతో ఈఆర్వో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లను చేయడం, అవసరాలను గుర్తించడం, సదుపాయాలు కల్పించడంలో మరింత క్రియాశీలకంగా పనిచేయాలని సూచించారు. ఆయా సెక్టోరల్ అధికారులు తమ పరిధిలోని పోలింగ్‌స్టేషన్లలో వాస్తవ పరిస్థితిని స్వయంగా పరిశీలించి అక్కడ సదుపాయాల కొరత ఉంటే తక్షణమే నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో ఈవీఎం, వీవీప్యాట్‌ల పనితీరు, మాక్‌పోల్ నిర్వహణ, పోస్టల్ బ్యాలెట్ వంటి అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో పలువురు సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.

'వైసీపీని పంపడానికి సిద్ధం'

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 8: వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపడానికి మేము సిద్ధమని జనసేన పీఏసీ సభ్యులు, సిటీ ఇన్‌చార్జి ముత్తా శశిధర్, జనసైనికులు నినదించారు. సాంబమూర్తినగర్‌లో 13వవార్డు అధ్యక్షుడు పాలిక శివ ఆధ్వర్యంలో చెత్తపన్ను వేసిన చెత్త ప్రభుత్వాన్ని తరిమి వేయడానికి మేము సిద్ధం అంటూ శుక్రవారం కార్యక్రమం చేపట్టారు. శశిధర్ మాట్లాడుతూ నోటికి వచ్చిన మాటలతో వాగ్దానాలు చేసి అధికారం చేపట్టిన సీఎం జగన్ తీరా అధికారంలోకి వచ్చాక వాగ్దానాలను తుంగలోకి తొక్కి ప్రజావ్యతిరేక పాలన చేసి ఆఖరికి చెత్తమీద పన్నులు వేసి ప్రజలను పీడించుకుని తింటున్నాడని విమర్శించారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాసిరెడ్డి శివ, జిల్లా కార్యదర్శి అట్ల సత్యనారాయణ, కరీముల్ల, దవులూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల విజయోత్సవం

కరప, ఫిబ్రవరి 8: ప్రభుత్వాధికారులు ఎన్ని రకాలుగా ఇబ్బం దులకు గురిచేసినా, ఎదురు నిలిచి సంఘటితంగా పోరాడి సమస్యలు పరిష్కరించుకోకలిగామని అంగన్‌వాడీల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జి.బేబీరాణి అన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి 11 డిమాండ్లతో 10 డిమాండ్లకు అంగీకరించింది. జూన్ నెలలో జీతాలు పెంచుతామని హామీ ఇవ్వడంతో సమ్మె విరమించామన్నారు. సమ్మె విజయవంతమవ్వడంతో గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా మండల అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు నిర్వహించిన విజయోత్సవసభలో పాల్గొని ఆమె మాట్లాడారు. అనంతరం కేక్ కట్ చేసి విజయోత్సవ వేడుకలు జరుపుకున్నారు. అంగన్‌వాడీల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ చంద్రకళ, కాకినాడరూరల్ ప్రాజెక్టు అధ్యక్షురాలు పి.వీరవేణి, కార్యదర్శి వీరవేణి, కోశాధికారి ఎ.వరలక్ష్మి, కరప, గొర్రిపూడి, నడకుదురు, వేళంగి సెక్టార్ల లీడర్లు ఎస్.వరలక్ష్మి, ఎ.అచ్చరత్నం, ఎం. భవానీ, ఆర్.దైవకుమారి పాల్గొన్నారు.

నందీశ్వరుడికి వెండి కొమ్ములు బహూకరణ

ప్రత్తిపాడు, ఫిబ్రవరి8: రాచపల్లిలోని అపీత కుంచాబ సమేత అరుణాచలేశ్వరస్వామి ఆలయంలో నందీశ్వరుడికి గురువారం ఏలేశ్వరానికి చెందిన భక్తులు వెండి కొమ్ములు, వెండి కళ్లు అందజేశారు. ఏలేశ్వరానికి చెందిన చిట్టింశెట్టి పుల్లయ్య, నాగ మల్లేశ్వరి దంపతులు 1250 గ్రాముల వెండి నేత్రాలు, కొమ్ములను నందీశ్వరునికి అలంకరించారు. కార్యక్రమంలో రమణ సేవాశ్రమ నిర్వాహకుడు రమానంద, తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

జగ్గంపేట, ఫిబ్రవరి8: జగ్గంపేట మండలం గోకవరం రోడ్డు వైపుగా వాహనాల్లో పీడీఎస్ రైస్ తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు గురువారం తెల్లవారుజామున విజిలెన్స్, సివిల్ సప్లై అధికారులు పోలీసులతో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో బావిశెట్టి కనకరాజు 54 ప్లాస్టిక్ బస్తాలతో పీడీఎస్ రైస్‌ను ఒక వాహనంలో తరలిస్తూ పట్టుబడ్డాడు. అదేవిధంగా జొన్నాడ గ్రామానికి చెందిన నల్లమశెట్టి లక్ష్మణరావు 20 బస్తాలు పీడీఎస్ బియ్యాన్ని గోనేడ నుంచి గోకవరంవైపు తరలిస్తుండగా అతనిని అధికారులు అదుపులోకి తీసుకుని బొలెరో వాహనం, పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. వీరిపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఎస్ఐ ఎం.జనార్ధనరెడ్డి, సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ జీఎంఎం కృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పిఠాపురం ఆర్వోబీకి అదనంగా నిధులు విడుదల చేయాలి

పిఠాపురం, ఫిబ్రవరి 8: పిఠాపురం పట్టణంలోని ఉప్పాడ రైల్వేగేటు వద్ద నిర్మించనున్న ఆర్వోబీకి అదనపు నిధులు విడుదల చేయాలని కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ కోరారు. ఈమేరకు ఢిల్లీలో కేంద్ర ఉపరితల రవాణాశాఖా మంత్రి నితిన్‌గడ్కరీని గురువారం ఎంపీ కలిసి వినతిపత్రం అందజేశారు. సేతుబంధన్ పథకంలో భాగంగా జాతీయ రహదారుల విభాగం ద్వారా తొలుత రూ.45కోట్లు మంజూరు చేసినట్లు ఎంపీ తెలిపారు. ఇప్పటికే ఆర్వోబీ భూసేకరణ నిమిత్తం సీఎం జగన్ రూ.39కోట్లును మంజూరు చేశారని తెలిపారు.

ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతుల పంపిణీ

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 8: చొల్లంగి అమావాస్య సందర్భంగా గురువారం జనసేన పార్టీ కాకినాడ రూరల్ ఇన్‌చార్జి పంతం నానాజీ ఆధ్వర్యంలో పగడాలపేటలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. గొడారిగుంటలో ముగ్గుల పోటీల్లో రాణించిన మహిళలకు బహుమతులను పంతం నానాజీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని ధర్నా

తాళ్లరేవు, ఫిబ్రవరి 8: మండలంలోని సుంకరపాలెం సెంటర్‌లో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతూ వర్తకసంఘం, ఆటో ,లారీ యూనియన్, స్కూల్స్, కాలేజీ విద్యార్థులు, ప్రయాణికులు, స్థానిక ప్రజలు గురువారం ధర్నా చేశారు. ఈసందర్భంగా జనసేన నాయకుడు సుంక ర రామచంద్రరావు మాట్లాడుతూ రోడ్డుమీదకు ప్రవహిస్తున్న మురుగునీరును అరికట్టాలని స్థానిక పంచాయతీ సెక్రటరీకి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఏమీచేయలేని పరిస్థితిలో గత్యంతరం లేక రోడ్డుపై దర్నా చేస్తున్నామని అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుపై మురుగు వ్యర్థాన్ని నివారించే చర్యలు చేపట్టాలని కోరారు.

ఉద్యాన పంటల సాగుపై అవగాహన

పెద్దాపురం, ఫిబ్రవరి 8: మండలంలోని జె.తిమ్మాపురం గ్రా మంలో ఉద్యానపంటల సాగుపై రైతులకు అవగాహన కార్యక్ర మం గురువారం నిర్వహించారు. ఉద్యానశాఖాధి కారిణి నూనే సుజాత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్ర మంలో ఆయిల్‌పామ్ సాగు, యాజమాన్య పద్ధతులు, ఎరువుల యాజమాన్యం, తెగుళ్లు, అధిక దిగుబడులు సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలు తదితర విషయా లపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్ర మంలో వీహెచ్‌ఏ విజయదుర్గ, జ్యోతి, పతంజలి ఫుడ్స్ ప్రతి నిధులు క్లస్టర్ ఇన్‌చార్జ్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఏలేశ్వరం టీడీపీ శ్రేణుల నిరసన

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 8: ప్రత్తిపాడు నియోజకవర టీడీపీ ఇన్‌చార్జ్ వరుపల సత్యప్రభ తీరుకు గురువారం ఏలేశ్వరంలో పట్టణ టీడీపీ కార్యకర్తలు నిరసన తెలిపారు. ఇన్‌చార్జ్ సత్యప్రభ వ్యవహరిస్తున్న తీరు పార్టీకి నష్టం కలిగించే విధంగా ఉందని ఆందోళన వ్యక్తం చేస్తూ టీడీపీ నాయకులు స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు.

అనఘా దత్త క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

పిఠాపురం, ఫిబ్రవరి 8: పిఠాపురం పట్టణంలోని అగ్రహారంలో వేంచేసి ఉన్న శ్రీపాదవల్లభ అనఘా దత్తక్షేత్రంలో ద్వావింశ(22వ) బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. తొలి రోజున గణపతిపూజ, కలశస్థాపన, అనఘా దత్తాత్రేయస్వామికి క్షీరాభిషేకం, వారుణకుంభస్థాపన, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, రుద్రహోమం, కలశ పూజ తదితర పూజలు జరిగాయి. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పూర్వవైభవం : మాజీ కేంద్రమంత్రి పళ్ళంరాజు

శంఖవరం, ఫిబ్రవరి 8: రాహుల్‌గాంధీ నేతృత్వంలో రాష్ట్రంలో కాంగ్రెసుకు పూర్వవైభవం రానుందని, కాంగ్రెస్‌లోకి వచ్చి తమతో పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే పర్వత బాపనమ్మ, శంఖవరం ఎంపీపీ పర్వత రాజబాబులను మాజీ కేంద్రమంతి ఎంఎం పళ్ళంరాజు ఆహ్వానించారు. గురువారం రాజబాబు కుటుంబాన్ని కలిసిన పళ్ళంరాజు రాష్ట్రంలో కాంగ్రెస్ బలపడుతున్న విధానాన్ని వివరించారు.

ఏవీ నగరం పీహెచ్‌సీని పరిశీలించిన కేంద్ర బృందం

తొండంగి,ఫిబ్రవరి8: ఆర్మన్ (అడ్వాన్సింగ్ రిడక్షన్ మోర్టాలిటీ అండ్ మోర్బిడిటీ ఆఫ్ మదర్స్ చిల్డ్రన్ అండ్ నియోనేట్స్) కేంద్ర బృంద సభ్యులు గురువారం ఏవీనగరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని పరిశీలించారు. భారతీయ వైద్య విధాన పరిషత్ ఆదేశాల మేరకు డాక్టర్ అనుదీప్తి ఆధ్వర్యంలోని బృందం ఆసుపత్రిని సందర్శించి పలు అంశాలు నమోదు చేసుకున్నారు. గర్భిణులకు దీర్ఘకాలిక వ్యాధులు రాకుండా తీసుకుంటున్న చర్యలను వైద్యాధికారి రవికుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. లేబర్ రూమ్‌ను సందర్శించి అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. హైరిస్క్ కేసుల విష యంలో తగు జాగ్రత్తలు పాటించాలని, క్షేత్రస్థాయి సిబ్బంది ద్వారా పౌష్టికాహారం, ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని వారు సూచించారు.

కో-ఆప్షన్ సభ్యుడిగా మన్యం చంద్రరావు ఏకగ్రీవం

సామర్లకోట, ఫిబ్రవరి 8: సామర్లకోట మున్సిపల్ మొదటి కో-ఆప్షన్ సభ్యుడిగా సీనియర్ మాజీ కౌన్సిలర్ మన్యం చంద్రరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం సామర్లకోట మున్సిపల్ కౌన్సిల్ ప్రత్యేక సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ జీ.అరుణ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో మొదటి కో-ఆప్షన్ సభ్యుని పదవికి మన్యం చంద్రరావు ఒక్కరే నామినేషన్ దాఖలు కావడంతో కౌన్సిల్ సమావేశంలో చంద్రరావు పేరును తొలుత వైస్‌చైర్మన్ జాన్ మోజెస్ ప్రతిపాదించగా అందుకు సభ్యులు ఆమోదిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో కమీషనర్ రామారావు కో-ఆప్షన్ పదవికి మన్యం చంద్రరావు పేరును ప్రకటించి ధృవీకరణ పత్రాన్ని చంద్రరావుకు అందజేశారు.

'బీసీ సదస్సును జయప్రదం చేయండి'

కరప, ఫిబ్రవరి 8: కరప మండలం యండమూరు గ్రామంలో టీడీపీ రాష్ట్ర ఆరోగ్య విభాగ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ నలుకుర్తి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో టీడీపీ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా బీసీల రక్షణకై చేపట్టిన జయహో బీసీ కార్యక్రమం నిర్వహించనున్న సందర్భంగా కరప మండల పరిధిలో గల గ్రామాలన్నీ తిరిగి టీడీపీ నాయకులు, కార్యకర్తలను గ్రామప్రజలు కలిసి ఈ కార్యక్రమానికి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కరప మండల అధ్యక్షులు దేవ వెంకన్న, కట్ట రంగారావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బుగ్గన బడ్జెట్ అంతా అంకెల గారడీ

• జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, ఫిబ్రవరి 8: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైసీపీ ప్రజలను మరోసారి మోసంచేయడానికి మరొక అంకెల గారడీ బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అసెంబ్లీలో ప్రవేశపెట్టారని జగ్గంపేట ఇర్రిపాక శివాలయంవద్ద రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండంత బడ్జెట్ అంచనాతో కేటాయించేది గోరంత అని రూ.13వేల కోట్ల రెవెన్యూలోటును రూ.44వేల కోట్లకు రూ.35వేల కోట్లకు ద్రవ్యలోటును రూ.44వేల కోట్లకు, రూ.35వేల కోట్లకు ద్రవ్య లోటును, రూ.60వేల కోట్లుకు పెంచిన ఘనత బుగ్గనదేనని ఆయన ఎద్దేవా చేశారు. పన్నుల బాదుడు తప్ప బడ్జెట్లో కొత్త అంశాలు లేవన్నారు.

రాష్ట్ర బడ్జెట్ అంతా అంకెల గారడీనే..

• జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ధ్వజం

కాకినాడసిటీ, ఫిబ్రవరి 8: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంతా అంకెల గారడీగానే ఉందని, పన్నుల బాదుడు తప్ప బడ్జెట్‌లో కొత్త అంశాలు ఏమీ లేవని కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ధ్వజమెత్తారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బడ్జెట్ అంచనాలు కొండంత.. ఖర్చులు పిసరంత అన్నట్లుగా కేటాయింపులు ఉన్నాయన్నారు. విద్యుత్‌చార్జీల వడ్డనలో ఏపీ సర్కార్ ఎక్కడా రాజీపడలేదని మండిపడ్డారు.

ఆదిత్యలో డిజిటల్ డైలామా అవగాహన సదస్సు

గండేపల్లి, ఫిబ్రవరి 8: మండలంలో సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఆధ్వర్యంలో మానవ శ్రేయస్సుపై సోషల్‌మీడియా, మొబైల్ వినియోగం ప్రభావాన్ని ఆవిష్కరించే డిజిటల్ డైలామాపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి విశ్రాంత అడిషనల్ పోలీస్ సూపరింటెండెంట్, ప్రముఖ ఇంద్రజాలికుడు, మనస్తత్వ వేత్త డాక్టర్ మనోహర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషల్‌మీడియా ప్రాముఖ్యత విద్యలో సోషల్‌మీడియా సానుకూల, ప్రతికూల అంశాలపై విద్యార్థులతో చర్చించారు. కార్యక్రమంలో కె.స్వరూప, సునీత, అశోక్‌కుమార్, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రౌతులపూడి ఎంపీడీవోగా ప్రేమసాగర్ బాధ్యతల స్వీకరణ



రౌతులపూడి, ఫిబ్రవరి 8: రౌతులపూడి ఎంపీడీవోగా ఎం. ప్రేమసాగర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఏలేశ్వరం ఎంపీడీవోగా పని చేసిన ప్రేమసాగర్ బదిలీపై రౌతులపూడి వచ్చారు. మండలంలోని గ్రామాల అభివృద్ధికి కృషి చేయనున్నట్టు తెలిపారు.

నేడు వ్యవసాయ సలహాదారుడు తిరుపాల్‌రెడ్డి రాక

సామర్లకోట, ఫిబ్రవరి 8: రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహా దారుడు, క్యాబినెట్ హోదా అధికారి ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి శుక్రవారం ఉదయం సామర్లకోటలో పర్యటించనున్నట్లు ఇన్‌చార్జి తహశీల్దార్ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. గురువారం రాత్రి విలేకరులతో తహశీల్దార్ మాట్లాడుతూ శుక్రవారం తిరుపాల్‌రెడ్డి సామర్లకోటకు 7.30కు చేరుకుంటారని స్థానికంగా వరి పొలాలను సందర్శించి దాళ్వా సాగులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను రైతులతో కలిసి అధ్యయనం చేయనున్నారు. అనంతరం ఇక్కడి నుంచి పిఠాపురం కారులో బయలుదేరుతారు.

టిడ్కో గృహాలు తాళాలు పగులగొట్టి లబ్ధిదారులకు అప్పగిస్తా : వైసీపీ సభ్యుడి ధ్వజం

సామర్లకోట, ఫిబ్రవరి 8: సామర్లకోట మున్సిపాలిటీలో ఏ చిన్న పనికూడా అధికారులు చేయడంలేదు. ఏదైనా సమస్య చెప్పాలంటే సిగ్గేస్తుంది. టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అప్పగించడంలో అధికారులు తాత్సార్యం చేస్తున్నారు. నేనే లబ్ధిదారులను వెంట పెట్టుకుని తాళాలు పగులగొట్టి స్వాధీనం చేస్తానని ఎవరు అడ్డొస్తారో చూస్తాను అంటూ తీవ్రమైన స్వరంతో అధికార వైసీపీ పక్ష కౌన్సిలర్ నేతల హరిబాబు హెచ్చరించారు. గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ జీ.అరుణ అధ్యక్షతన జరిగిన ప్రత్యేక సమావేశంలో సభ్యుడు హరిబాబు మాట్లాడుతూ పొరుగున ఉన్న పెద్దాపురంలో సైతం లబ్ధిదారులకు టిడ్కో గృహాలను అప్పగించి నప్పటికీ సామర్లకోటలో అధికారులు పనిచేయడం చేతకావడం లేదన్నారు. ఇంత దారుణ పరిస్థితి గతంలో నేనే ఎన్నడూ చూడలేదని అధికారుల వైఖరిపై నిప్పులుచెరిగారు. ఒకదశలో హరిబాబు వాదనలను చైర్‌పర్సన్ అడ్డుకునే ప్రయత్నం చేసినప్పటికీ చైర్‌పర్సన్‌పై సైతం తాను ఇలానే మాట్లాడతానని తీవ్రస్వరంతో హరిబాబు స్పష్టం చేశారు. ఇందుకు మరికొందరు సభ్యులు కూడా హరిబాబు వాదనకు మద్దతు పలికారు. దీనిపై కమిషనర్ జాస్తి రామారావు మాట్లాడుతూ వారంరోజులలో సమస్య పరిష్కారమయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. దీంతో ప్రత్యేక సమావేశం ముగిసిందని చైర్‌పర్సన్ అరుణ ప్రకటించారు.

సినిమా గైడ్

కాకినాడ

ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్: ఈగల్, లాల్‌సలామ్, యాత్ర-2

దేవీ మల్టీప్లెక్స్ 4 స్క్రీన్స్: లాల్‌సలామ్, ఈగల్, యాత్ర-2

తిరుమల	:	యాత్ర-2
లక్ష్మీ	:	ఈగల్
సీ అండ్‌సీ1	:	ఈగల్
సీ అండ్‌సీ2	:	హనుమాన్
శ్రీప్రియ	:	గుంటూరుకారం
పద్మప్రియ	:	అంబాజీపేట మ్యారేజిబ్యాండు
సత్యగౌరి	:	లాల్‌సలామ్
సూర్య 1	:	ఈగల్
సూర్య 2	:	లాల్‌సలామ్

రాష్ట్రస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థుల ఎంపిక

కరప, ఫిబ్రవరి 8: జంగారెడ్డిగూడెంలో ఈనెల నాలుగు నుంచి ఆరు వరకు జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో కరప మహాత్మా జ్యోతి బాఫూలే గురుకుల విద్యాసంస్థ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అండర్ 14 విభాగంలో ఆర్.సంతోష్, అండర్ 17విభాగంలో జి.రమణబాబు, పి.ధననరసింహ పాల్గొన్నారు. ఈ ముగ్గురు ద్వితీయ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వారిని ప్రిన్సిపాల్ రామ కృష్ణారావు, పీఈటీ మదన్ అభినందించారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

కరప, ఫిబ్రవరి 8: సానా సతీష్‌బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. ప్రజలకు వైద్య పరీక్షలను నిర్వహించారు. ప్రజలకు ఆరోగ్య పరిరక్షణ పట్ల వైద్యులు అవగాహన కల్పించారు. ఫౌండేషన్ సభ్యులకు ధన్యావాదలు తెలలిపారు. ఈ కార్యక్రమంలో నడకుదురు ఆలయ ధర్మకర్త ఎస్వీ రామకృష్ణ, సానా సతీష్‌బాబు, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు

బాలల హక్కులపై అవగాహన

పెద్దాపురం, ఫిబ్రవరి 8 : స్థానిక లూథరన్ హైస్కూల్లో బాల హక్కులపై హెచ్ఎం ఫిలిప్‌రాజు గురువారం అవగాహన కల్పించారు. జిల్లా చైల్డ్ హెల్ప్‌లైన్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు. బాలలపై జరుగుతున్న వేధింపులు, అఘాయిత్యాలను అరికట్టాన్నారు.